క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాపాడు : ప్రతి గ్రామంలో అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని జగనన్న సురక్ష పథక మండల లెవల్ అధికారి ఇంతియాజ్ పేర్కొన్నారు. మండలంలోని గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. ఏదేని సమస్య కారణంగా ఎక్కడైనా సంక్షేమ పథకాలకు నోచుకోని వారుంటే వెంటనే పథకాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ షమీబ్ భాను తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు కె.దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగరాజరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా కె.దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా గిద్దలూరు మదనగోపాల్, కోశాధికారిగా వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, సహాయ కార్యదర్శి యేసోబు, సహాయ కోశాధికారిగా చిట్టిబాబు, కమిటీ ఆర్గనైజర్‌గా మహేష్‌తో పాటు, మరో 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వివరించారు.

రేపు అద్దె గదులకు వేలం

మైదుకూరు : పట్టణంలోని జెడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదులను అద్దెకు ఇచ్చుటకు ఈనెల 28న వేలం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కడప రోడ్డులో ఉన్న మూడు జెడ్పీ కాంప్లెక్స్ రూములను బుధవారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని, ఈ కార్యక్రమం జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ఒక్కో రూముకు రూ.5వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. వేలంలో రూములను దక్కించుకున్న వారు రూ.2లక్షలు అడ్వాన్స్ కింద నాలుగు విడతల్లో చెల్లించాలని వివరించారు.

నోటు పుస్తకాల పంపిణీ

పోరుమామిళ్ల : ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు చిత్తా థామస్‌రెడ్డి, డాక్టర్ గీత దంపతులు సోమవారం 660 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండల పరిషత్ పాఠశాలలు గురప్పగారిపల్లె, రంగసముద్రం మెయిన్, రంగసముద్రం దళితవాడ, మహబూబ్‌నగర్ మెయిన్, ఉర్దూ, గిరినగర్ ఎస్టీ కాలనీ, సుందరయ్యకాలనీ, పోరుమామిళ్ల మెయిన్, రామాయపల్లె, ఆదిఆంధ్ర పాలెం పాఠశాలల్లో చదువుతున్న 660 మంది విద్యార్థులకు 2000 నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధి ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, ఎంఈఓ రత్నస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఆలయకమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసాచారి

పోరుమామిళ్ల : పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాసాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వీరాచారి, కోశాధికారిగా వీరబ్రహ్మాచారి, ఉపాధ్యక్షులుగా తిరుమలయ్యాచారి, రమణాచారి, పెద్ద రంగాచారి, నాగార్జునాచారి, సహాయ కార్యదర్శిగా ఈశ్వరయ్యాచారి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా జగన్‌మోహనాచారిని ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా శ్రీనివాసాచారిని శాలువా, పూల దండలతో సన్మానించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎస్సీ కాలనీలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన దువ్వూరులోని సచివాలయం–2 పరిధిలోని ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు తమకు సిమెంటు రోడ్లు, పక్కా గృహాలు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తప్పకుండా ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి సంక్షేమ పథకాలు వెంటనే అందిస్తామన్నారు. కార్యాలయాల చుట్టు తిరగకుండా కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు అందిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చారని, మిగిలిన ఐదు శాతం మంది కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆగస్టు నెల చివరినాటికి పూర్తవుతుందన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 83 సచివాలయాలు ఉండగా, 56 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. దువ్వూరు సచివాలయం–2 పరిధిలోని వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.10కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామని చెప్పారు. రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లకీ సేవ

చాపాడు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన వీరభద్ర స్వామి ఆలయ సన్నిధిలో సోమవారం ఘనంగా పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వీరభద్ర స్వామి, భద్రకాళీ మాత ఉత్సవ విగ్రహ మూర్తులతో ఆలయ ప్రాంగణలో వేద పండితులు నరేంద్రశర్మ, అర్చకులు భరత్ కుమార్ శర్మ, గోవింద స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన భక్తిగీతాలాపన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిగీతాలాపన అందరిని అలరించింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో 108 భక్తిగీతాల ను ఆలపించడం అభినందనీయమన్నారు. సంస్కృతి సాంప్రదాయాలలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణానికి చెందిన చంద్రశేఖర్ ఒక చేతితో కీబోర్డ్, మరో చేతితో తబలా, కాలితో గజ్జలను వాయిస్తూ భక్తిగీతాలు ఆలపించడం ఆకర్షణగా నిలిచింది. వాసవీ అన్నమయ్య లహరి గ్రూపు దేవరశెట్టి నాగమణి బృందంవారు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు.

హామీలు నెరవేర్చాడు.. అభివృద్ధి చేస్తున్నాడు



సంక్షేమ వివరాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

పోరుమామిళ్ల : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయని, ముఖ్యమంత్రి చెప్పిన మాట నిలబెట్టుకోవడంతో పాటు చెప్పనివి కూడా అమలు చేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి వివరించారు. సోమవారం ఉదయం పేరమ్మగారిపల్లె, బొప్పాపురం, దళితవాడ, సాయంత్రం దమ్మన్నపల్లె పంచాయతీ మార్కాపురం, ఈదుళ్లపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందిన పథకాలు వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకొన్నారు. అందాల్సిన సదుపాయాలపై వాకబు చేశారు. గతంలో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టి మోసం చేశాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచులు రవిప్రసాద్ రెడ్డి, రఘురామిరెడ్డి, ఎంపీటీసీ మహాలక్షుమ్మ, మాజీ సర్పంచ్ జేకే, రాజీవ్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిమానాన్ని చూరగొన్న నేత నాగభూషణం

బద్వేలు అర్బన్ : ఒక్క ఆర్యవైశ్య సామాజిక వర్గమే కాకుండా అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొన్న నేత రాచపూడి నాగభూషణం అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు స్వర్గీయ రాచపూడి నాగభూషణం ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన కుమారులు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్‌గుప్తలు రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు కొండపల్లి చిన్న సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. సబ్‌జూనియర్ అండర్ –11, 13 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలుప్రాంతాలకు చెందిన 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కరరెడ్డి మాట్లాడుతూ నిత్యం క్రీడాసాధన చేసి నైపుణ్యం సంపాదించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. క్రీడాకారులకు చాలామందికి ఐడీ లేదని, త్వరగా ఐడీ తీసుకోవాలని కోరారు. లేకుంటే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోతారన్నారు. జార్జ్ కారొనేషన్ క్లబ్ సెక్రటరీ గంగిరెడ్డి మాట్లాడారు. విజేతలుగా నిలిచిన వారికి మెమెంటోలను అందచేశారు. అండర్–13 బాలుర విభాగంలో మోహ్మద్ ఆదిల్, బాలికల విభాగంలో పూర్వజ, అండర్–11 బాలుర విభాగంలో విశాల్‌రెడ్డి, బాలికల విభాగంలో కుజుమాకానం ఛాంపియన్లుగా నిలిచారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, చైర్మన్ జిలాని బాష, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, కోచ్ సుదర్శన్, అనిల్, సోని, సామ్యూల్, రామయ్య, జాకీర్ పర్యవేక్షించారు.

ఘనంగా సమర్థ నారాయణ ఆరాధన మహోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె వద్ద ఉన్న శ్రీసద్గురు సమర్థనారాయణ ఆశ్రమంలో శ్రీసద్గురు సమర్థనారాయణ మహరాజు వారి ఆరాధన మహోత్సవాలు మూడో రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ముక్తేశ్వర స్వామికి భక్తులు సామూహికంగా రుద్రాభిషేకం, ప్రతాప మారుతి స్వామికి శ్రీచందన అలంకరం చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. మంగళవారం ఆరాధనోత్సవాల్లో భాగంగా చండీ హోమం, నవగ్రహ, శ్రీదత్త హోమాలు, ధన్వంతరీ హవనం, లక్ష్మీనారాయణ స్వామికి మహా నారాయణ అభిషేకం, లక్ష్మీనారాయణ స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చాపాడు : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం డ్రగ్స్ వాడకం – వాటి వలన కలిగే దుష్పరిణామాలు అంశంపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునే వయస్సులో ఎలాంటి చెడు అలవాట్లకు లోను కాకుండా కేవలం చదువు మీద, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలపైనే దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని భవష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కలసపాడు : స్థానిక షిర్డిసాయిబాబా ఐటీఐ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఎస్ఐ నాగమురళి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, లోన్‌యాప్స్, ర్యాగింగ్, మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అజ్ఞాన వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి చర్యలు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలనాయుని పేటలో రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణానికి మున్సిపాలిటీ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సోమవారం నుంచి ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్నారు. త్వరలో ఈ వీధిలో ఇరువైపులా డ్రైనేజీ కాలువలను, సిమెంటు రోడ్డును నిర్మించనున్నారు. శ్రీరాములపేటలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సోమవారం పర్యటించారు. ఈ వీధిలో త్వరలో రోడ్లను విస్తరించడంతో పాటు డ్రైనేజి కాలువలను నిర్మిస్తామని తెలిపారు. వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పారిశుధ్య కార్మికుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి వేతనాన్ని రూ.12వేల నుంచి రూ.15వేలకు పెంచుతామని హామీ ఇవ్వడంతో మున్సిపల్ కార్మికులు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సమయంలో సుమారు 100 మంది పారిశుధ్య కార్మికులను తీసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో రూ.12వేలు వేతనం సరిపోవడం లేదని, పిల్లల చదువులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కౌన్సిల్‌లో పెట్టి రూ.15వేలకు పెంచుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి, ఇందుకు సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిలకు రుణపడి ఉంటామని కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రాజుపాళెం : అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు విజయకుమార్, బాలసుబ్బయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆర్డర్ ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, కేంద్రాల అద్దె పెంచాలని తెలిపారు. అలాగే కూరగాయల బిల్లులు పెంచాలన్నారు. దీనిపై జులై 10న 36 గంటల ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రతి మోములో చిరునవ్వు చూడాలన్నదే జగన్ ఉద్దేశం

బి.కోడూరు : రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని, అందుకోసమే ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మేకవారిపల్లె, ప్రభలవీడు, తంగేడుపల్లె, తుమ్మలపల్లె గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో మండల జేసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంఎల్‌ఓ రవీంద్రారెడ్డిల ఆధ్వర్యంలో వలంటీర్లు, గృహసారథులతో జగనన్న సురక్ష పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ నరసారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభలవీడు సర్పంచ్ జయరామిరెడ్డి, తుమ్మలపల్లె సర్పంచ్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీలు తగ్గించండి

పోరుమామిళ్ల : విద్యుత్‌చార్జీలు విపరీతంగా పెంచుతూ ప్రజలపై మోయలేని భారం వేస్తున్నారని, పెంచిన చార్జీలు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ఏడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

గోవధను నిషేధించాలి

ప్రొద్దుటూరు : గోవధను నిషేధించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్, గో సంరక్షణ సమితి ఆధ్వర్యంలో వేర్వేరుగా సోమవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా గోవుల మాంసాన్ని విక్రయిస్తున్నారని వారు తెలిపారు. ఈనెల 5న ప్రభుత్వం ప్రత్యేకంగా గోవధ నిషేధంపై ఆదేశాలు జారీ చేసిందని, ఈ ఆదేశాలను అమలు చేయాలని కోరారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: మండలంలోని సిద్దారెడ్డిపల్లె, మొర్రాయిపల్లె గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో అన్ని రకాలైన రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోండి

పోరుమామిళ్ల : మండల కేంద్రంలో పెట్రోల్, డీజల్ బంకులు రాత్రి పూట వాహనాలకు ఫిల్లింగ్ చేయడం లేదని సీపీఐ నాయకులు మస్తాన్, రవి ఆరోపించారు. రాత్రి 9 గంటలు దాటితే డీజల్, పెట్రోల్ లేదు పొమ్మంటున్నారని, తెల్లవారుజామున 5 గంటలకు బంకుల్లో సిబ్బంది ఉండటం లేదని వారు ఆరోపించారు. వివిధ పనులపై వెళ్లే వారు, అత్యవసరంగా, ప్రాణాపాయ స్థితిలో ఎక్కడికైనా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. వాహనాలకు రాత్రి సమయంలో పెట్రోల్ పోయామంటున్న పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

నవరసాల దృశ్య కావ్యం అక్కినేని దేవదాసు

ప్రొద్దుటూరు క్రైం : అక్కినేని నాగేశ్వరరావు దేవదాసు చిత్రంలో నటించలేదని, జీవించారని అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ జిల్లా ప్రెసిడెంట్ నల్లం రవిశంకర్ తెలిపారు. దేవదాసు చిత్రం విడుదలై 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రొద్దుటూరులో సోమవారం వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని అభిమానులందరూ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం రవిశంకర్ మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి జంటగా నటించిన దేవదాసు తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను విజయవంతం చేయండి

బి.కోడూరు : సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు సమష్టి కృషితో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ మార్కారెడ్డి తెలిపారు. సోమవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు అధ్యక్షతన సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మార్కారెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్‌లో సిబ్బంది తప్పక హాజరవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన

కాశినాయన : ప్రజల సమస్యలను పరిష్కరిచేందుకే స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మండల ప్రత్యేకాధికారి నాగభూషణం, తహసీల్దారు రామచంద్రుడు, ఎంపీడీఓ మైథిలిలు తెలిపారు. సోమవారం మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

కుష్టు వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని డాక్టర్ హాజీరా తెలిపారు. లెప్రసీ డిటెక్షన్ కాంపైన్‌లో భాగంగా సోమవారం దేవాంగపేట యూపీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చర్మంపై ఉన్న స్పర్శలేని పొడలను కుష్టువ్యాధిగా అనుమానించాలన్నారు. ఇలాంటి పొడలు ఉన్న వారు వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్యుల సలహా మేరకు వాటిని వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ యం శివ శంకరయ్య, వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ వెంకటసుబ్బమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ పరిధిలో

మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం అనుమానిత లక్షణాలు కలిగిన వారు వైద్యులను సంప్రదించాలన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి

రాజుపాళెం : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పర్లపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు కశిరెడ్డి మధుసుదన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పర్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 3 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు తన సొంత నిధులతో 80 మంది విద్యార్థులకు కాపిరైట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయ్యాక ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో మార్చారన్నారు. కార్యక్రమంలో పరిమళ, పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంఈఓ–2 శోభారాణి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జాన్ సుబ్బయ్య ఆధ్వర్యంలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.30వేల నగదు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. జాన్ సుబ్బయ్య మాట్లాడారు.